క్లుప్తంగా

పోలీస్ స్టేషన్ ప్రారంభం


పూజలు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

చుంచుపల్లి: చుంచుపల్లి ఎన్కే నగర్ బైపాస్‌లో నూతనంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనాన్ని కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, సీఐ పెద్దన్న కుమార్, ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పాత పోలీస్‌స్టేషన్‌లో సరైన వసతులు లేకపోవడంతో ప్రజలు, సిబ్బంది పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా నేటి నుంచి ఈ స్టేషన్ నుంచి సేవలు అందించనున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రంగాకిరణ్ దరఖాస్తు


దరఖాస్తు అందజేస్తున్న రంగాకిరణ్

చుంచుపల్లి: కొత్తగూడెం అసెంబ్లీ బీజేపీ అభ్యర్థిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీ రంగాకిరణ్ ఆదివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో దరఖాస్తు అందజేశారు. ఫోన్‌లో మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ కొత్తగూడెం అసెంబ్లీ అభ్యర్థిగా తమకు అవకాశం కల్పించాలని రాష్ట్ర కమిటీకి విన్నవించుకున్నట్లు తెలిపారు.

జోక్యాన్ని సహించేది లేదు..

జూలూరుపాడు: గిరిజన నియోజకవర్గాల్లో పెత్తనం చేస్తే సహించేది లేదని గిరిజన జేఏసీ అధ్యక్షుడు భూక్యా దేవీలాల్ నాయక్ అన్నారు. ఆదివారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్‌పై తప్పుడు రిపోర్టులతో టికెట్ రాకుండా మంత్రి పువ్వాడ అజయ్ అడ్డుకోవడం సరైన విధానం కాదన్నారు. గిరిజనుల పట్ల వివక్ష మంచిది కాదన్నారు. రాజ్యాంగం గిరిజనులకు కల్పించిన హక్కులను కాలరాస్తే ఎలా అని ప్రశ్నించారు.

ఆరోపణలు నిరూపిస్తే దేనికైనా సిద్ధం

టేకులపల్లి: మండలంలో తమ రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక బంధువులతో పాటు మరికొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వాటిని నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనని టేకులపల్లి ఎంపీపీ భూక్యా రాధ, ఆమె భర్త భూక్యా సైదులు నాయక్ అన్నారు. ఈ మేరకు ఆదివారం టేకులపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. భూకబ్జాలు చేశానని, పోడు భూమి పట్టాలకు డబ్బులు తీసుకున్నానని ఆరోపణలు చేస్తున్నారని, ఇవన్నీ నిరాధారమైన ఆరోపణలని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేసేందుకే ఎంపీపీ పదవి తీసుకున్నామని, పదవిని అడ్డుపెట్టుకుని భూ కబ్జాలకు పాల్పడే అలవాటు తమకు లేదని తెలిపారు.

అగ్రవర్ణాల తీరుతో ఇక్కట్లు

కొత్తగూడెంరూరల్: అగ్రవర్ణాల పాలకుల చేతిలోనే తెలంగాణ సమాజం మగ్గిపోతుందని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్మీదేవిపల్లి మండలం కొత్తూరు గ్రామంలో పర్యటించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. 90 శాతానికి పైగా ఉన్న బీసీ దళిత గిరిజన మైనార్టీ వర్గాల వారికి అధికారం అందడం లేదన్నారు. కేవలం అగ్రవర్ణాల పార్టీల చేతిలో రాజకీయ కూలీలుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

స్టాఫ్ లేదు.. టికెట్ ఇవ్వం..

- సుజాతనగర్‌లో ఆగని ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు
- వర్తించని 'ఫేర్ స్టేజ్'
- ప్రయాణికులపై పడుతున్న అదనపు భారం


సుజాతనగర్ మండల కేంద్రంలోని వాహన రహదారి

సుజాతనగర్: పరిపాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వం మండల కేంద్రాలను ఏర్పాటు చేసినా ఆ దిశగా కొన్ని ప్రయోజనాలు మండలవాసులకు దక్కడం లేదు. సుజాతనగర్ మండల కేంద్రంలో అన్ని డిపోలకు చెందిన ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు బ్రేకులు పడటం లేదు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి సుజాతనగర్‌కు రావాల్సిన ఉద్యోగులు, ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించక తప్పడం లేదు. ఒకవేళ ప్రయాణిలకు అభ్యర్థన మేరకు బస్సు ఆగినా ప్రయాణికులపై అదనపు భారం పడుతోంది. బస్సు ఆపే క్రమంలో కొందరు ప్రయాణికులు కండక్టర్లతో చీదరింపులకు గురవ్వక తప్పడం లేదు. కొత్తగూడెం నుంచే వచ్చే ప్రయాణికుడు సుజాతనగర్‌లో దిగాలంటే జూలూరుపాడు వరకు, ఖమ్మం వైపు నుంచి వచ్చే ప్రయాణికుడు కొత్తగూడెం వరకు టికెట్ తీసుకోవాల్సి వస్తోంది. జిల్లాలోని భద్రాచలం డిపో పరిధిలో 65, కొత్తగూడెం డిపో పరిధిలో 55, మణుగూరు డిపో పరిధిలో 37 మొత్తం 157 బస్సులు ప్రతిరోజూ ప్రయాణికులను చేరవేస్తుంటాయి. ఆర్టీసీ ఆధ్వర్యంలో 112 అద్దె బస్సులు ప్రతిరోజూ నడుస్తుంటాయి. ఈ బస్సులు 60 – 65 వేల మందిని ప్రతిరోజూ వారివారి గమ్యస్థానాలకు చేరవేస్తుంటాయి. హైదరాబాద్, ఖమ్మం, భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు డిపోలకు చెందిన బస్సులు నిత్యం సుజాతనగర్ మీదుగా వెళ్తుంటాయి. అయితే కేవలం కొత్తగూడెం డిపోకు చెందిన బస్సులను మాత్రమే సుజాతనగర్‌లో ఆపుతున్నారు మిగిలిన ఏ డిపో బస్సు ఎక్కినా ముందున్న స్టేజీ వరకు టికెట్ కొనాల్సిందే. దీంతో ప్రయాణికులు అదనపు భారం తప్పడం లేదు. సుజాతనగర్‌కు చెందిన వ్యాపారులు, ప్రజలు, విద్యార్థులు నిత్యం జిల్లా కేంద్రం కొత్తగూడెంకు వెళ్తుంటారు. ఇక్కడ బస్సు ఆగే సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

అన్ని డిపోలకు వర్తించడం లేదు..

బస్సు ఆపాలంటే ఆర్టీసీ అధికారులు ఫేర్ స్టేజ్ నిర్ణయిస్తారు. దీని ప్రకారంగా బస్సు ఎక్కడ ఆగాలో అక్కడి వరకే టికెట్ తీసుకుంటారు. లేదంటే ముందున్న స్టేజీ వరకు టికెట్ కొనుగోలు చేయాల్సిందే. ప్రస్తుతం ఫేర్ స్టేజ్ కొత్తగూడెం డిపోకు చెందిన బస్సులకు మాత్రమే అమలవుతోంది. ఈ ఫేర్ స్టేజీ సదుపాయం ఇతర డిపోల బస్సులకు లేదు. ఆయా బస్సులు ఫేర్ స్టేజీ ప్రకారంగా జూలూరుపాడు, తల్లాడ, వైరాలో ఆగుతున్నాయి. కానీ సుజాతనగర్‌లో ఆగే అవకాశం లేకపోవడంతో ఆయా డిపోలకు చెందిన బస్సుల్లో ఎక్కిన ప్రయాణికులు అదనపు చార్జీలను చెల్లించాల్సి వస్తోంది. భద్రాచలం, మణుగూరు, ఖమ్మం, హైదరాబాద్ డిపోలకు చెందిన బస్సుల్లో అదనపు భారం పడకుండా మండల కేంద్రంలో ఆపాలని పలువురు ప్రయాణికులు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.

జనరల్ బాడీ సమావేశంలో అడుగుతున్నాం..



సుజాతనగర్ మండల కేంద్రంగా ఏర్పడినా ఇతర డిపోల నుంచి వచ్చే బస్సులను ఇక్కడ ఆపడం లేదు. బస్సులు ఆగడం లేదని ప్రతిసారీ జనరల్ బాడీ సమావేశంలో అడుగుతూనే ఉన్నాం. ఈ విషయాన్ని డీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం అంటూ ఆర్టీసీ అధికారులు చెబుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదు.

– సీకా కృష్ణవేణి, సర్పంచ్, సుజాతనగర్

జూలూరుపాడు వరకు టికెట్ తీసుకుంటున్నాం..



ప్రతిరోజూ పాల్వంచ నుంచి సుజాతనగర్‌కు వస్తుంటాను. సుజాతనగర్‌కు స్టాప్ లేదని జూలూరుపాడు వరకు టికెట్ తీసుకుంటున్నారు. దీంతో అదనపు భారం పడుతోంది. నాలాంటి వాళ్లు చాలామంది ఉన్నారు. సుజాతనగర్‌కు టికెట్ తీసుకొని బస్సు ఆపితే అందరికీ ప్రయోజనం.

– జి.రమణ, జూనియర్ అసిస్టెంట్, ఎంపీడీఓ కార్యాలయం

కొత్తగూడెం డిపో బస్సులను ఆపుతున్నాం



కొత్తగూడెం డిపోకు చెందిన అన్ని బస్సులు సూపర్ లగ్జరీతో సహా మండల కేంద్రం సుజాతనగర్‌లో స్టాప్ ఉంది. మిగిలిన డిపోలకు చెందిన బస్సుల విషయంలో ఆయా డిపోల అధికారుల చేతిలో ఉంటుంది. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– బాణాల వెంకటేశ్వరరావు, ఆర్టీసీ డిపో మేనేజర్, కొత్తగూడెం

నేటి నుంచి రైతాంగ పోరాట వారోత్సవం


మాట్లాడుతున్న సాబీర్‌పాషా

సుజాతనగర్: నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడి ఎందరో కమ్యూనిస్టులు, ఉద్యమకారులు నేలకొరిగారని, వారి త్యాగాలు నేటితరానికి అవసరమని, వారి పోరాటస్ఫూర్తిని స్మరించుకుంటూ ఈ నెల11 నుంచి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాం రాచరిక పాలనలో వెట్టిచాకిరీ, అంటరానితనం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, దారిద్ర్యం ఇలాంటి పరిస్థితులు హైదరాబాద్ రాష్ట్ర ప్రజలను వెంటాడుతున్న తరుణంలో కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో ఉద్యమాలకు పిలుపునిచ్చి నిజాం రాచరిక వ్యవస్థను కూల్చివేయడం జరిగిందన్నారు. నాడు రైతాంగ పోరాటంలో పేదలకు పంచిన భూముల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ మూడో వంతు కూడా పంచలేదని విమర్శించారు. కొంతమంది అవకాశవాదులు పోరాటాన్ని తామే చేసినట్లుగా చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సాయుధ పోరాటానికి తామే వారసులమంటూ బీజేపీ నాయకులు రాజకీయంగా లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సభలు, సమావేశాలు, జెండావిష్కరణ కార్యక్రమాలు చేపట్టి నాటి కమ్యూనిస్టుల స్ఫూర్తిని చాటి చెప్పాలన్నారు. 17న హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ విలీన దినోత్సవ సభకు జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భూక్యా దస్రు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, వేల్పుల భాస్కర్, కొమారి కృష్ణ, కత్తి వెంకన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు

సింగరేణి(కొత్తగూడెం): 11వ వేజ్‌బోర్డ్ విషయంలో టీబీజీకేఎస్ తప్పుడు ప్రచారాన్ని సీఐటీయూ కొత్తగూడెం బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. 23 నెలల ఏరియర్స్‌ను ఈనెల 21న చెల్లించటానికి యూనియన్ నాయకులు యాజమాన్యంతో మాట్లాడి కార్మికులకు ఇప్పిస్తున్నామని తప్పుడు ప్రచారం చేస్తున్నారని కానీ, కోలిండియా యాజమాన్యం సింగరేణి యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేసి నెల రోజులవుతోందని పేర్కొన్నారు. అయినా టీబీజీకేఎస్‌లో స్పందన లేదని, ఏరియర్స్ విషయంలో జాతీయ కార్మిక సంఘాల ఆందోళన ఫలితంగానే యాజమాన్యం స్పందించి ఏరియర్స్ చెల్లింపు తేదిని శనివారం ప్రకటించారని, ఆదివారం మీడియాలో వార్త వచ్చే వరకు వారికి తెలియదని వివరించారు. కార్మిక సంఘాలు కేంద్ర కార్మిక శాఖకు ఫిర్యాదు చేస్తామన్న విషయం తెలిసిన యాజమాన్యం ఒకే దఫా చెల్లిస్తున్నట్లు ప్రకటించిందన్నారు. చిత్తశుద్ధి ఉంటే ఏప్రిల్‌లో ప్రకటించిన లాభాలలో వాటా చెల్లించే విధంగా సీఎంతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 2022లో ఆర్ఎల్‌సీ సమక్షంలో టీబీజీకేఎస్, జాతీయ కార్మిక సంఘాలతో చేసిన ఒప్పందాన్ని యాజమాన్యం అమలు చేసేందుకు టీబీజీకేఎస్ కృషి చేయాలని కోరారు.

'ఉపాధి' జిల్లా ప్రధాన కార్యదర్శిగా హరికిషన్



జూలూరుపాడు: ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జూలూరుపాడు మండలం కరివారిగూడెం ఫీల్డ్ అసిస్టెంట్ గుగులోత్ హరికిషన్ ఎన్నికయ్యారు. ఆదివారం కొత్తగూడెంలో ఆ యూనియన్ సమావేశం జరిగింది. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

నాభిశిల ప్రతిష్ఠ

ఇల్లెందురూరల్: రాజీవనగర్‌తండా గ్రామంలో ఆదివారం నాభిశిల ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళందరూ తమ ఇళ్ల నుంచి బోనాలతో వచ్చి బొడ్రాయికు నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యఅతిథిగా జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణ ప్రసాద్, పూనెం సురేందర్, మండల రాము మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

టేకులపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ అన్నారు. ఈ మేరకు ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టేకులపల్లి మండలం మద్రాస్ తండా గ్రామానికి చెందిన పలువురు ఎన్డీ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. వారికి గులాబీ జెండా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

'బలవంతంగా బీఆర్ఎస్ కండువా కప్పారు'

కొత్తగూడెంఅర్బన్: వార్డులో జరిగిన అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు బలవంతంగా బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలో జాయిన్ అయ్యానని ప్రచారం చేస్తున్నారని, తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నట్లు వార్డు కౌన్సిలర్ తంగేళ్ల లక్ష్మణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొటోకాల్ ప్రకారం వార్డులో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యాను కానీ, బీఆర్ఎస్‌లో చేరలేదని స్పష్టం చేశారు.

నేడు సింగరేణిలో రోస్టర్ రిజిస్టర్ వెరిఫికేషన్

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 11న సింగరేణి కార్పొరేట్ కార్యాలయంలో ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎనిమిది మంది కమిటీ సభ్యులచే రోస్టర్ రిజిస్టర్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు ఆ సంఘం జనరల్ సెక్రటరీ ఆంతోటి నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆ సంఘం కార్పొరేట్ భవనంలో మాట్లాడారు. సింగరేణిలో ఎస్సీ, ఎస్టీలకు తగు న్యాయం జరగడం లేదని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో, నియామకాలు, పదోన్నతుల రోస్టర్‌ను వెరిఫికేషన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. పదోన్నతుల విషయంలో ఏదైనా తప్పిదం జరిగి ఉంటే, తమ అసోసియేషన్ దృష్టికి తీసుకురావాలని వెరిఫికేషన్ చేయిస్తామని చెప్పారు. అదేవిధంగా ఈనెల 12న కార్పొరేట్ ఎడ్యుకేషన్ సొసైటీలో కూడా రోస్టర్ నిర్వహించనున్నట్లు వివరించారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వనమా

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం నియోజకవర్గ ప్రజల దీవెనలు, ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో కొత్తగూడెంను సుందరంగా తీర్చిదిద్దుతున్నానని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం కొత్తగూడెం మున్సిపాలిటీలోని రామా టాకీసు, మధురబస్తీ, సన్యాసిబస్తీ, ఏ పవన్ హౌస్‌బస్తీ ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. సుమారు రూ.17 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయాలకతీతంగా కొత్తగూడెంను అభివృద్ధిలో తీర్చిదిద్దుతున్నానని, అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలన్నదే లక్ష్యం అన్నారు. ఆరుగురు ముఖ్యమంత్రుల దగ్గర పని చేశానని, సంక్షేమ పథకాల అమలులో సీఎం కేసీఆర్ గిన్నిస్ రికార్డు సృష్టిస్తున్నారని వివరించారు. అనంతరం కాంగ్రెస్ కౌన్సిలర్ తంగెళ్ల లక్ష్మణ్, ముస్లిం మైనార్టీ నాయకులు అహ్మద్ బీఆర్ఎస్ పార్టీలో చేశారు. వనమా రాఘవేందరావు, కాపు సీతాలక్ష్మి, భూక్యా రాంబాబు, వేముల ప్రసాద్, కోలాపూరి ధర్మరాజు, అంబుల వేణు, తంగెళ్ల లక్ష్మణ్, ఆమని, నేరెళ్ల, కనుకుంట్ల పార్వతి, దుంపల అనురాధ, బుచ్చయ్య పాల్గొన్నారు.

వ్యవసాయ రంగం నిర్వీర్యం


మాట్లాడుతున్న కిసాన్ మోర్చా నాయకులు

టేకులపల్లి: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే విధానాలకు వ్యతిరేకంగా పోరాడదామని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్లు రేపాకుల శ్రీనివాస్, బానోత్ ఊక్లా పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. దేశంలో సహజ వనరులను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని విమర్శించారు. కార్పొరేట్లకు వ్యవసాయ రంగంపై కన్నుపడిందని, వారికి అనుకూలంగా మోదీ వ్యవసాయ చట్టాలు మార్చాడని, వీటికి వ్యతిరేకంగా ఢిల్లీలో రైతుల పోరాటానికి మోదీ వెనక్కి తగ్గారని, మళ్లీ దొడ్డిదారిన వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్లను తీసుకొస్తున్నారని విమర్శించారు. దీనిని వ్యతిరేకించేందుకు కార్మిక, కర్షక సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చాగా ఐక్యమయ్యాయని తెలిపారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాటం ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ధర్మపురి వీరబ్రహ్మాచారి, గుగులోత్ రాంచందర్, కడుదుల వీరన్న, భూక్యా నర్సింగ్, గుగులోత్ రాంచంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందుకు సమర్థ నాయకత్వం కావాలి


కరపత్రాలు అవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇల్లెందు: 60 ఏళ్లుగా దగా పడుతున్న ఇల్లెందును అభివృద్ధి చేయటానికి, పేదల కన్నీళ్లు తుడవడానికి సమర్థుడైన నాయకుడు కావాలని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు భూక్యా దళ్‌సింగ్ నాయక్ అన్నారు. ఆదివారం ఇల్లెందులోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షుడు డానియేల్, పులి సైదులు, మహమూద్, బోగ నందకిషోర్, శ్రీనివాస్, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పట్టణ, మండల అధ్యక్షుడిగా దొడ్డా డానియేల్, పులి సైదులను ప్రకటించటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ వారిని ఘనంగా సత్కరించారు.

గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి


మాట్లాడుతున్న సీఐ వినయ్‌కుమార్

పాల్వంచరూరల్: మత సామరస్యాన్ని పాటిస్తూ ప్రశాంతమైన వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించుకునేందుకు నిర్వాహకులు తప్పనిసరిగా అన్నిశాఖల నుంచి అనుమతులు తీసుకోవాలని సీఐ వినయ్‌కుమార్ సూచించారు. ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు మండల పరిధి కిన్నెరసానిలోని రూరల్ పోలీసుస్టేషన్‌లో ఆదివారం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సీఐ సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలన్నారు. మండపాలు ఏర్పాటు చేసుకునే ముందు గ్రామపంచాయతీ, విద్యుత్‌శాఖ అనుమతులు తీసుకోవాలి, మైకు పర్మిషన్‌కు డీఎస్పీ నుంచి అనుమతులు పొందాలన్నారు. డీజేలకు అనుమతులు లేవని చెప్పారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రి 8 గంటలు దాటిన తర్వాత మైకులు అనుమతించబడవు, మండపాల వద్ద జరిగే అల్లర్లకు, విద్వేషాలకు కమిటీ సభ్యులే పూర్తి బాధ్యత వహించాలని తెలిపారు. ప్రార్థనా మందిరాలు, విద్యాసంస్థలకు దగ్గరలో మండపాలను ఏర్పాటు చేయకూడదన్నారు. నిమజ్జనం సందర్భంగా ఊరేగింపుగా వెళ్లేటప్పుడు మద్యం సేవించినా, చిన్నపిల్లలను ఊరేగింపులో తీసుకొచ్చినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముస్లింలు మిలాద్ ఉల్ నబీ పండుగను ప్రశాంతంగా నిర్వహించేందుకునేందుకు అందరూ సహకరించాలన్నారు. రూరల్ ఎస్ఐ.కార్తీక్, పోలీసు సిబ్బంది, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఉపాధ్యాయులతో 1980 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

సింగరేణి(కొత్తగూడెం): చుంచుపల్లి మండలం ధన్‌బాద్ పంచాయతీలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో 1980 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. వివిధ ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడిన వీరంతా యోగక్షేమాలను అడిగితెలుసుకున్నారు. పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం నాటి గురువులను, ప్రస్తుత వైస్ ప్రిన్సిపాల్ (నాటి క్లాస్‌టీచర్) బ్రదర్ జార్జిరెడ్డి, వీనస్ టీచర్‌లను ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు రవిప్రసాద్, వెంకటరమణ, జడ్సన్, అనిల్ రాజు, సత్యనారాయణ, రమాదేవి, ఈశ్వర్, పీఎస్ఆర్ ప్రభాకర్‌రావు, అనిల్, కోటేశ్వరరావు, శేషుకుమార్, ప్రేమ్‌కుమార్, గోవింద్, వెంకట్‌రెడ్డి, రాజేశ్వరరావు, విజయ్‌కుమార్, మారుతి, సత్యనారాయణ, సరోజ, సువర్ణ, సునీత, రమాదేవి, పీటర్, పద్మ పాల్గొన్నారు.

నేటితరానికి ఐలమ్మ పోరాటం స్ఫూర్తి


సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో...

భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువ చూపిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 38వ వర్ధంతిని ఆదివారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో నిర్వహించారు. ఐలమ్మ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్


ఇల్లెందు: నివాళులర్పిస్తున్న చైర్మన్ దీవీ


చుంచుపల్లి: జెడ్పీ సమావేశ మందిరంలో..


జూలూరుపాడు: పాపకొల్లులో..


కొత్తగూడెంఅర్బన్: ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం


సింగరేణి(కొత్తగూడెం): నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు


పాల్వంచ: వెంగళరావు కాలనీలో...


టేకులపల్లిలో నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

అటెన్షన్ ప్లీజ్

జాతీయ రహదారిపై గుంతలు



పాల్వంచ మండల కేంద్రంలో నిత్యం 24 గంటలు వాహనాల రద్దీ ఉండే బీసీఎం జాతీయ రహదారిపై ప్రమాదం పొంచి ఉంది. పాల్వంచ పట్టణంలో సీ కాలనీ గేటు నుంచి పెద్దమ్మ గుడి వరకు రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. మరమ్మతులు నిర్వహించాలని సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాహనదారులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నేషనల్ హైవే అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

– పాల్వంచరూరల్



ప్రశ్నించాల్సిన అధికారి : యుగంధర్, ఎన్‌హెచ్, ఈఈ
సెల్ నెంబర్: 8333923755